

# ఫ్రీపాస్

## ఎ.కె. సేనగుప్త

"నేను టికెట్ కొని ఆ సినిమా చచ్చినా చూడను. మీ నవల ఆధారంగానే గదా వాళ్లు సినిమా తీసింది. పాస్ ఎందుకివ్వరూ?_ ఏడు పాస్‌లు కావాలి!" అంది సునంద భర్తతో.

"రెండు చాలుగదా" అన్నాడు ప్రవీర్.

"చాలవు మీ అక్క కబురుచేసింది. వాళ్ళూ వస్తారట. మొత్తం ఏడుగురికి పాస్‌లు తెప్పించండి."

"తెప్పించడం దేనికి? వాళ్లే వచ్చి ఇచ్చి వెళతారు!"

"పిక్చరు ఎప్పుడు విడుదలవుతుందండీ?"

"త్వరలోనే"

"ఇదుగో! పేపర్లో అడ్వర్టయిజ్‌మెంట్ ఉందండీ!...అరే! మీ పేరు చిన్న అక్షరాలతో ఒకమూల వేశారు. . డైరక్టరూ, మ్యూజిక్ డైరక్టర్ల పేర్లు తాటికాయంత అక్షరాలతో వేశారు. ఏమీ బాగాలేదు."

"నా నవల పేరు మార్చారు. కథలో కూడా మార్పులూ, చేర్పులూ బోలెడు చేశారట."

"అయితే ఏం? మూలరచయిత మీరే గదా! ఇంత ఉపేక్ష పనికిరాదు."

"అది అంతే సునందా! దుర్గాపూజ సందర్భంలో పందిరికి ఏడువందలూ, విగ్రహానికి తొమ్మిదివందలూ, లైట్లకు ఐదొందలూ ఖర్చుపెట్టి చివరకు పురోహితుడి చేతిలో ప ది రూ పా య లు పెడతాం," అన్నాడు ప్రవీర్ భార్యకు నచ్చజెప్పే ధోరణితో.

"నాకివన్నీ తెలియవు. ఆ సినిమాకు ఏడుపాస్‌లు మాత్రం తెప్పించండి..." అని చెప్పి లోపలికెళ్ళింది సునంద చిరుకోపంతో.

తర్వాత రెండురోజులకు ప్రవీర్ బజార్నుంచి ముఖం వ్రేళ్లాడ వేసుకొచ్చి "ఇవాళ ఉదయం ప్రివ్యూ ఇచ్చారట" అన్నాడు భార్యతో.

"మిమ్మల్ని పిలవలేదేం?"

"ప్రముఖ వ్యక్తుల్ని పిల్చారట. మంత్రులూ, పత్రికా విలేఖర్లూ, సంపాదకులూ, పట్టణంలో ధనవంతులూ మొదలైనవార్ని పిల్చారట."

"ఆ ప్రముఖ వ్యక్తుల కిందకు మీరు రారా? మీ నవల ఆధారంగానే గదా ఆ సినిమా తీసింది మ ర్యా ద కై నా మిమ్మల్ని పిలవాల్సిందే!''

"నా నవలను పూర్తిగా మార్చివేశారట. నేను గొడవచేస్తానని నాకు ఆహ్వానం పంపలేదేమో! పిక్చరు రిలీజైన రోజున పిలుస్తారేమో! అదీగాక ప్రివ్యూ రోజున కొంచెం రద్దీగా వుంటుందితే'' అన్నాడు ప్రవీర్ భార్యను సమాధాన పర్చే తలంపుతో.

సునంద మెత్తబడింది. "అంతే అయివుంటుంది. ఏమైనా ఫస్ట్‌డేన ఫస్ట్‌షోకు ఏడు పాస్‌లు కావాలి" అంది.


ఫిల్మ్ రిలీజైంది ఆ రోజున. మధ్యాహ్నంకూడా అయింది. సాయంత్రం గడిచిపోయింది, కాని ఆ సినిమాకు కథ వ్రాసిన రచయిత దగ్గరకు ఎవరూ రాలేదు. ఫ్రీ పాస్‌లు ఇవ్వలేదు

"పోనిద్దూ! మనిద్దరం టిక్కెట్లు కొనుక్కొని చూసి వద్దాం," అన్నాడు ప్రవీర్ భార్యతో.

"మీ నవల ఆధారంగా సినిమా తీయడమేమిటి? మనం మామూలు జనం లాగ టిక్కెట్లు కొనుక్కొని చూసిరావడమేమిటి? నలుగురూ నవ్విపోరూ? నేను రాను" అంది సునంద కుండ బ్రద్దలు కొట్టినట్టు.

ఫస్ట్‌షో హౌస్‌ఫుల్ అయింది. టిక్కెట్లు దొరకనివాళ్ల నిరాశతో తిరిగి వెళ్ళిపోతూండటాన్ని దూరంగా ఫుట్‌పాత్‌మీద నిలబడి చూశాడు ప్రవీర్. ఈ పిక్చరు ఫ్లాప్ అయితే బావుండు భగవంతుని దయవల్ల. మూడోరోజుకు డబ్బాలు తిరిగి వెళితే మ ం చి గా వుంటుంది, అనుకొంటూ ఇంటి మొహం పట్టాడు ప్రవీర్.

కాని ప్రవీర్ అనుకున్నట్టు ఆ



పిక్చరు ఫ్లాప్ కాలేదు. పైపెచ్చు హిట్ అయి కూర్చుంది. నగరంలో జనం విరగబడి చూస్తున్నారు. ప్రొడ్యూసర్ మరో పిక్చర్ తీయబోతున్నట్టుకూడా ప్రకటించాడు.

"మన ఫిల్మ్ మాంచి హిట్ అయింది. కలక్షన్స్ జోరుగా ఉన్నాయట" అన్నాడు ప్రవీర్ భార్యతో ఓరోజు.

"మీరు దానికి కథరాయడ మేమిటి? విజయాన్ని పొందక పోవడమేమిటి?" అంది సునంద సంతోషాతిశయంతో.

"ఒకరోజు ఎవరికీ తెలీకుండా టికెట్టు కొనుక్కొని సెకండ్ షోకు వెళదాం ఇద్దరమూ" అన్నాడు ప్రవీర్.

"మీకు అభిమానమేమీఉన్నట్టులేదు" అంది సునంద కోపంగా-ఇంట్లోకిపోతూ.

"సినిమా రచయితకు అభిమానం కూడానా!" అనుకున్నాడు ప్రవీర్ తనలో తాను.

ఆ రెండోరోజున ప్రవీర్‌కు ఏదో ఉత్తరం అందిస్తూ పోస్టుమాన్ అన్నాడు, "బాబుగారూ! మీ నవల ఆధారంగా తీసిన సినిమా బ్రహ్మాండంగా పోతూం దని అందరూ చెప్పుకుంటున్నారు. రెండు ఫ్రీ పాస్‌లు ఇప్పించారంటే నేనూ, నా భార్యా వెళ్లి చూసొస్తాం."

"అవునోయ్. వాళ్ళు నాకు చాల పాస్‌లు పంపించారు. కాని ఎవరెవరో వాటిని తన్నుకెళ్లారు. ఒక్కటీ మిగ ల్లేదు. ఒక పనిచేయ్" అని జేబులోంచి మూడురూపాయలు తీసి పోస్ట్‌మాన్‌కు ఇస్తూ, "ఈ డబ్బుతో మీరిద్దరూ వెళ్లండి. మంచిసినిమా. బాక్సాఫీస్ హిట్ అయింది" అన్నాడు.

ఆ డబ్బును పోస్టుమాన్ జేబులో పెట్టు కుంటూ, "మీరు రాసిన కథ హిట్ కాక పోవడమేమిటి? మీ పుస్తకాలంటే జనం చెవి కోసుకుంటారు. మీకెంతో పేరుంది" అని వెళ్లిపోయాడు.

ఆ వెళ్లిపోతున్న పోస్టుమాన్‌కేసి చూస్తూ నిలబడిపోయాడు సుప్రసిద్ధ నవలారచయిత ప్రవీర్.